సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 27 । మే । 2024



నూకాలమ్మా.. కరుణించమ్మా..
ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవర పాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తుల పోటెత్తారు. 8లో



ఘనంగా ఆర్జిత సేవలు
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. 8లో



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు
విశాఖ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రిటైర్డ్ పీడీ ప్రతిభ

- మూడు పతకాలు సాధన



సాధించిన పతకాలతో రిటైర్డ్ పీడీ భిక్షం

చింతూరు: హైదరాబాద్‌లో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన ఫస్ట్ ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ గేమ్స్ 60 ప్లస్ కేటగిరీలో స్థానిక రిటైర్డ్ పీడీ మెండు భిక్షం మూడు పతకాలు సాధించారు. జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీల్లో భాగంగా హైజంప్, డిస్కస్ త్రోలో రెండు వెండి పతకాలు, హేమర్ త్రోలో కాంస్య పతకం సాధించినట్టు ఆయన తెలిపారు.

200 మందికి వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రంపచోడవరం : స్థానిక రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆవరణలో ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించినట్టు రాజమహేంద్రవరం శ్రీరామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమా మహేష్ ,టి. వెంకట సుబ్బారావు, సంపత్ కుమార్ సుమారు 200 మందికి వైద్యసేవలు అందించినట్టు ఆయన పేర్కొన్నారు. వీరిలో 57 మందికి రక్త పరీక్షలు, పది మందికి థైరాయిడ్, ఒకరికి ఈసీజీ, 12 మంది ఎక్స్‌రే, తొమ్మిది మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్టు ఆయన వివరించారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 46మందికి కంటి పరీక్షలు నిర్వహించి 22మందికి కళ్లజోళ్లు అందించినట్టు ఆయన వివరించారు. ఇద్దరి కంటి ఆపరేషన్ నిమిత్తం వేమగిరి పరమహంస యోగానంద ఆస్పత్రికి తరలించినట్లు స్వామిజీ వివరించారు. ఈ కార్యక్రమాల్లో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, నక్కా చంటి బాబు, వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. రోగులు, సహాయకులకు భోజన సౌకర్యం కల్పించారు.

3 నుంచి కథక్ నృత్య వర్క్‌షాప్



కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్

మద్దిలపాలెం: అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్ చే విశాఖ వేదికగా వచ్చే నెల 3 నుంచి 7వ తేదీ వరకు వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు బత్తిన విక్రమ్ గౌడ్ తెలిపారు. విశాఖలో నిర్వహించే ఈ వర్క్‌షాప్‌కు హాజరు కావాలనే వారు ముందుగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు కథక్ నృత్యంలో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణలో పాల్గొనే ప్రతి ఒక్కరూ చివరి రోజున స్టేజ్ పై ప్రదర్శన ఇస్తారన్నారు. 10 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9848137445 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.11.33 కోట్లు.. 131 గ్రామాలు..

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో గోదావరి వరదలు సంభవిస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. దీనిలో భాగంగా సోమవారం చింతూరులో ఐటీడీఏ పీవో, ఆర్డీవో కావూరి చైతన్య వివిధ శాఖల అధికారులతో సమీక్షించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వరద సమయంలో సహాయక చర్యలు చేపట్టేందుకు, రవాణా సౌకర్యం కల్పించేందుకు అనువుగా రూ.11.33 కోట్లతో సుమారు 131 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం చేపట్టింది.

- విలీన మండలాల్లో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం
- గోదావరి వరద సమయంలో ఉపయోగపడేలా ఏర్పాటు
- ప్రణాళికపరంగా చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అధికారుల ముందస్తు ఏర్పాట్లు
- నేడు చింతూరు ఐటీడీఏలో అధికారులతో పీవో చైతన్య సమీక్ష

చింతూరు: వరదలు సంభవించినప్పుడు రవాణా వ్యవస్థకు ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు సజావుగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోంది. 2022లో వచ్చిన ఆకస్మిక వరదలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం చేపట్టింది.

- కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో గోదావరి, చింతూరు, వీఆర్‌పురం మండలాల్లో శబరినది ఉప్పొంగితే వరదనీరు రహదారులపైకి చేరి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది.
- 2022లో వచ్చిన వరదలకు భద్రాచలంలో 71.30 అడుగుల మేర వరద నీటిమట్టం నమోదుకాగా సుమారు 30 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించింది. ఈ కారణంగా నాలుగు మండలాల్లో 200 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 16 వేల కుటుంబాలకు చెందిన 60 వేల మంది నిరాశ్రయులయ్యారు.
- చింతూరు మండలంలో సోకిలేరు, జల్లివారిగూడెం వాగులు పొంగి ప్రవహించినప్పుడల్లా చింతూరు, వీఆర్‌పురం మండలాల మధ్య, మరో 17 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. కుయిగూరువాగు పొంగినప్పుడు కూడా ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలతో పాటు మండలంలోని నాలుగు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- చిడుమూరు వాగు వల్ల ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య, చంద్రవంక వాగు పొంగితే చింతూరు, కూనవరం మండలాలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది.
- కూనవరం మండలంలో పోలిపాక, కోతులగుట్ట వద్ద వరదనీరు రహదారి పైకి చేరడంతో భద్రాచలం, చింతూరు ప్రాంతాలకు రాకపోకలు సమస్య తలెత్తుతోంది.
- ఎటపాక మండలంలో రాయినపేట, నెల్లిపాక, నందిగామ, మురుమూరు ప్రాంతాల్లో వరదనీరు రహదారిపై చేరినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. వీఆర్‌పురం మండలంలో కన్నాయిగూడెం, రామవరం, అడవి వెంకన్నగూడెం, ఇప్పూరు వద్ద రహదారిపైకి కూడా వరదనీరు వచ్చేస్తోంది.

ముందస్తు చర్యలు చేపట్టాం



నాలుగు మండలాల్లో వరద సంభవించిన సందర్భంలో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపడతాం. ముందుగా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి గత వరదల్లో తీసుకున్న చర్యలు, ప్రస్తుతం వరదలు వస్తే చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తాం. ముందస్తు ప్రణాళికల ద్వారా నాలుగు మండలాల్లో వరదల సమయంలో తగిన జాగ్రత్తలు చేపడతాం. అధికారుల సూచనలతో సహాయక చర్యలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.

– కావూరి చైతన్య, ఆర్డీవో, ఐటీడీఏ పీవో, చింతూరు



వరదల సమయంలో ఉపయోగపడేలా కూనవరం మండలం కోతులగుట్ట, చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి మధ్య నిర్మిస్తున్న ప్రత్యామ్నాయ రహదారి

ఆదుకున్న సీఎం జగన్
గోదావరి వరదలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొంది. ప్రభుత్వం ముందుచూపుతో ప్రత్యేకంగా అధికారులను నియమించి ముందస్తు చర్యలు చేపట్టడంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. 2022లో సంభవించినప్పుడు వరద తగ్గుముఖం పట్టిన అనంతరం నాలుగు మండలాల్లో యుద్ధప్రాతిపదికన సహాయ కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించి అన్ని రకాలుగా ఆదుకున్నారు.

సహాయక చర్యలు సజావుగా చేపట్టేలా..

విలీన మండలాల్లో 2022లో వచ్చిన గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని విలీన మండలాల్లో ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రత్యామ్నాయ రహదారులపై దృష్టి సారించింది. వరద సమయంలో ఉపయోగపడేలా చింతూరు, కూనవరం, ఎటపాక మండలాల్లో ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది.

- కూనవరం మండలం కోతులగుట్ట నుంచి చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి వరకు 11.5 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ 6.98 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ నిర్మాణం పూర్తయితే వరదల సమయంలో 56 గ్రామాలకు ఊరట లభించనుంది.
- చింతూరు మండలంలో చట్టి నుంచి సింగన్నగూడెం జాతీయ రహదారి వరకు నాలుగు కిలోమీటర్ల మేర రూ 2.25 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల ముంపు ప్రాంతాలకు సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. సుమారు 50 గ్రామాలకు ఉపయోగకరం.
- చింతూరు మండలంలో బండారుగూడెం నుంచి కారంగూడెం వరకు రూ.90 లక్షలతో రెండు కిలోమీటర్ల మేర ప్రత్యామ్నాయ రహదారి పనులు పురోగతిలో ఉన్నాయి. ఇవి పూర్తయితే వరదల సమయంలో 10 గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు మార్గం సుగమం కానుంది.
- ఎటపాక మండలంలో చింతలచెరువు నుంచి నల్లకుంట వరకు రూ 1.20 కోట్లతో కిలోమీటరున్నర మేర రహదారి నిర్మిస్తున్నారు. వరద సమయంలో ఈ మార్గం 15 గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉపయోగపడనుంది.



2022లో సంభవించిన వరద సమయంలో ప్రత్యామ్నాయ రహదారి లేక చింతూరులో పడవలపై పంపిస్తున్న నిత్యావసరాలు



చింతూరు మండలంలోని బండారుగూడెం, కారంగూడెం మధ్య నిర్మించే ప్రత్యామ్నాయ రహదారికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధనలక్ష్మి (ఫైల్)

తప్పుడు తూకంతో టోకరా

చేపలు, మాంసం వ్యాపారుల మోసాలకు నర్సీపట్నం తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ కళ్లెం వేశారు. తప్పుడు తూకంతో వినియోగదారులకు మోసగిస్తున్న పది మంది వ్యాపారులను గుర్తించిన ఆమె వారిపై కేసులు నమోదు చేశారు.

- పాడేరులో చేపలు, మాంసం విక్రయదారుల మాయాజాలం
- భారీగా నష్టపోతున్న వినియోగదారులు
- కిలోకు 170 నుంచి 200 గ్రాముల వరకు తగ్గుదల
- మోసాన్ని గుర్తించిన తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ
- పది మంది వ్యాపారులపై కేసు నమోదు



ఐదు కిలోల తూకం రాయికి 5.910 కిలోల బరువు చూపిస్తున్న తూనిక యంత్రం

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో చేపలు, మాంసం తూకంలో మోసాలకు పాల్పడుతున్న పది మంది వ్యాపారులపై తూనికలు కొలతలు శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. కిలోకు 170 నుంచి 200 గ్రాములు తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. నర్సీపట్నం తూనికలు కొలతలు శాఖ అధికారి డి.అనురాధ సిబ్బందితో కలిసి జూనియర్ కళాశాల ఎదుట ఉన్న చేపల దుకాణం కాటాను తనిఖీ చేశారు. ఐదు కిలోల తూనిక రాయిని ఎలక్ట్రానిక్ తూనిక యంత్రంపై ఉంచగా, ఆరు కిలోల బరువు చూపించింది. అదనంగా సుమారు కిలో బరువు తూగడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కిలో చేపలు కొనుగోలు చేసిన వారికి 200 గ్రాములు తక్కువగా ఉండటంతో మూడు ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతాల్లోని మాంసం దుకాణాల వద్ద ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను తనిఖీ చేశారు. ఇక్కడ కూడా తూకంలో అక్రమంలో వెలుగుచూశాయి. కిలోకు 170 నుంచి 200 గ్రాముల వరకు తేడాను గుర్తించారు. వారిపైన కూడా కేసులు నమోదు చేశారు. పాతబస్టాండ్ రోడ్డులోని హోల్‌సేల్ కోళ్ల పారం వద్ద తూనిక యంత్రాన్ని తనిఖీ చేశారు. ఇక్కడ కూడా తప్పుడు తూకంతో వినియోగదారులను భారీగా మోసం చేస్తున్నారని గుర్తించిన తూనికలు కొలతలు శాఖ అధికారి అనురాధ కాటాను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది మంది చేపలు, మాంసం వ్యాపారులపై కేసు నమోదు చేశామని తెలిపారు. సీజ్‌చేసిన ఎలక్ట్రానిక్ యంత్రాలను మళ్లీ వినియోగించకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.



పాడేరులో చేపల దుకాణం వద్ద తప్పుడు తూకం యంత్రాలను సీజ్ చేస్తున్న అధికారి అనురాధ

పోటెత్తిన భక్తజనం



పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాల గుడికి తరలివచ్చిన భక్తులు

- మోదమ్మ పాదాల గుడి వద్ద దర్శనానికి బారులు
- ప్రత్యేక వాహనాల్లో రాక
- కిలోమీటరు పొడవునా నిలిచిపోయిన ట్రాఫిక్
- క్రమబద్ధీకరించిన పోలీసులు

సాక్షి,పాడేరు: ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో సందడి నెలకొంది. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో సుమారు కిలోమీటరు పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్‌ఐ లక్ష్మణరావు, సిబ్బంది వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం 6గంటల నుంచి మోదమ్మతల్లి పాదాలు గుడికి భక్తుల తాకిడి నెలకొంది. అమ్మవారి ఇంటి పండగలను జరుపుకున్నారు. పసుపు, కుంకుమలతోపాటు ఘటాలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పూజలు అనంతరం భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని కుటుంబాలు, బంధుమిత్రులతో సాయంత్రం వరకు గడిపారు. ఘాట్‌రోడ్‌లో ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. ఇక్కడికి వచ్చిన భక్తులంతా పాడేరులోని మోదమ్మ ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



మోదకొండమ్మ పాదాలు, విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



పాదాల గుడికి ఘటాలతో వస్తున్న భక్తులు



పాదాల గుడివద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

అడ్డతీగల-కాకినాడ ఆర్టీసీ సర్వీసులు

- డైరెక్ట్ బస్సులతో ప్రయాణికులకు సౌకర్యం
- ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ

అడ్డతీగల: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడకు అడ్డతీగల నుంచి డైరెక్ట్ బస్సు సర్వీసులు సోమవారం నుంచి నడపనున్నట్టు ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. అడ్డతీగల నుంచి ఉదయం 8.15, 10.15, మధ్యాహ్నం 1.15, సాయంత్రం 3.30 నాలుగు సర్వీసులు ఆయా సమయాల్లో కాకినాడకు బయలుదేరతాయన్నారు.అలాగే కాకినాడ డిపో నుంచి అడ్డతీగలకు ఉదయం7.45, 9.45, మధ్యాహ్నం 12.30, 2.40 గంటల సమయాల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు వీటిని ఏర్పాటుచేశామన్నారు.

వై.రామవరం: వై.రామవరం నుంచి కాకినాడ వెళ్లేందుకు నాలుగు బస్సు సర్వీసులను పొడిగించినట్టు ఆర్టీసీ బస్‌స్టేషన్ కంట్రోలర్ టి.అచ్చారావు తెలిపారు. ఇంతవరకు వై.రామవరం నుంచి ఏలేశ్వరం వరకు మాత్రమే ఉండే సర్వీసులను కాకినాడకు పొడిగించినట్లు ఆయన తెలిపారు. ప్రతీరోజు ఉదయం గం.7.30, 9.30, మధ్యాహ్నం గం.12.45, 2.45కు వై.రామవరం నుంచి ఈసర్వీసులు బయలుదేరి కాకినాడ వెళతాయని తెలిపారు. అలాగే కాకినాడ నుంచి ప్రతీరోజు ఉదయం గం.7.45, 9.45, మధ్యాహ్నం గం.12.30, 2.40 లకు బయలుదేరి వై.రామవరం వెళ్తాయని ఆయన పేర్కొన్నారు.

బొర్రా కిటకిట



ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. గత రెండురోజుల నుంచి భారీగా తరలివస్తున్నారు. గుహలను శనివారం 3,600 మంది తిలకించగా రూ.2.88 లక్షలు, ఆదివారం 4,700 తిలకించగా రూ. 3.82 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. – అనంతగిరి

మురిసిన పర్యాటకం



గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట కాఫీతోటల సందర్శనకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. కుటుంబసమేతంగా విచ్చేసి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. చల్లని వాతావరణంలో రోజంతా గడిపారు. ప్రత్యేక వాహనాల్లో తరలిరావడంతో అరకు–విశాఖ ఘాట్‌రోడ్డు రద్దీగా మారింది. – అరకులోయ రూరల్

వీకెండ్ సందడి



మండలకేంద్రం రాజవొమ్మంగికి సమీపాన కొయ్యూరు మండల పరిధి చింతవాని పాలెం జలపాతం వద్ద పర్యాటకులతో సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. – రాజవొమ్మంగి

క్లుప్తంగా

శ్రీమన్నారాయణ భక్తుల పాదయాత్ర


పీఠాధిపతి రామానందస్వామిజీతో పాదయాత్ర భక్త బృందం

జి.మాడుగుల: వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని ఈ నెల 23న స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు చేపట్టిన శ్రీమన్నారాయణ నామ సంకీర్తన పాదయాత్ర చింతపల్లి మండలం కృష్ణాపురం చేరింది. ఇక్కడ ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాకలపాటి గురుదేవుల ఆశ్రమం పీఠాధిపతి రామనంద స్వామిజీ కలసి ఆశీర్వాదం పొందారు. కృష్ణాపురం ఆలయ భక్త బృందం అన్నసమారాధన ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో సమరసత సేవా కమిటీ జిల్లా కన్వీనర్ మత్స్యరాస మత్స్యరాజు, భక్త సంఘ ప్రతినిధులు గబ్బాడివేఖర్, అడపా బాబూరావు, ఆలయ పూజారి కె. సన్యాసిరావు, మత్స్యలింగం, ఎ. శ్రీను పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

అక్కిరెడ్డిపాలెం: జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష షీలానగర్‌లోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 570 మంది విద్యార్థులకు గాను 569 మంది పరీక్షకు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. నిర్ణీత సమయానికి హాజరుకాకపోవడంతో ఓ విద్యార్థిని పరీక్షా కేంద్రంలోకి నిర్వాహకులు అనుమతించలేదు. కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య విద్యార్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు.


విద్యార్థి ఆలస్యంగా రావడంతో లోపలికి అనుమతించని సిబ్బంది

అప్రమత్తతే మందు

- జీవాలు ప్రమాదానికి గురైతే ఆందోళన వద్దు
- ప్రథమ చికిత్సతో ప్రాణాపాయం దూరం
- పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి సందీప్




పశువులకు వైద్యసేవలను అందిస్తున్న సిబ్బంది

అనంతగిరి: పశువులు విష పదార్థాలు తిన్నా, పాము కాటుకు లేదా విద్యుత్ షాక్‌కు గురైనా గిరిజన రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి. సకాలంలో జీవాలకు ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాపాయం తప్పుతుంది. వెంటనే సమీప పశువైద్యాధికారులను సంప్రదించాలి. ఎటువంటి ప్రమాదం జరిగినా జీవాలను గాలి తగిలే ప్రదేశంలోని ఉంచడం ముఖ్యమని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు.

పాముకాటుకు గురైతే: పచ్చికబయలు, పొలం గట్లపై నీటి కుంటల్లో పశువులు గడ్డి మేయడానికి వెళ్లే సమయంలో పాముకాటుకు గురవుతుంటాయి. పాము విషం శరీరంలోకి వెళ్లి రక్తప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో పశువు చనిపోయే అవకాశం ఉంది. 90 నిమిషాల తర్వాత తీవ్ర ప్రభావం చూపుతోంది. పశువు కిందపడిపోవడం, నోటి నుంచి నురుగ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి సమయంలో పశువు ఎక్కడైతే పాము కాటుకు గురైందో ఆ భాగంలో గట్టిగా ఒత్తి రక్తం బయటికి వచ్చేలా చేయాలి. అంటుబాటులో టించర్ ఉంటే పాముకాటు వేసిన చోట వేయాలి. కాటు పైభాగంలో కట్టు గట్టిగా వేయాలి.

విద్యుత్ షాక్‌కు గురైతే : విద్యుత్ తీగలు తగిలి పశువులు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతుంటాయి. ఈ సంఘటన ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో గిరిజన రైతులు అప్రమత్తంగా ఉండాలి. హై వోల్టేజీకి గురైతే మృతి చెందుతాయి. తక్కువ వోల్టేజీ అయితే పశువు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది. అటువంటి సమయంలో పశు వైద్యుల సూచన మేరకు ప్రథమ చికిత్స చేయాలి.

విష పదార్థాలు తిన్నప్పుడు: ఆరుబయట మేతకు వెళ్లేటప్పుడు కొన్నిసార్లు విషపూరితమైన పదార్థాలను తింటాయి. వాటి తినే జీవాలకు బొగ్గు పొడిని, నీటిలో కలిపి తాగించాలి. దీనివల్ల విషం కొంతవరకు విరుగుడవుతుంది. వైద్యులు సలహాలను తీసుకుని ప్రథమ చికిత్స చేయాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి




రైతులు అప్రమత్తంగా ఉంటే జీవాలు కాపాడుకోవచ్చు. జీవాలు విషయంలోని తగు జాగ్రత్తలు పాటించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణపాయం తప్పుతుంది. ఎప్పటికప్పుడు పశువుల వ్యాధులకు సంబంధించి పశువైద్యాధికారిని సంప్రదిస్తే సలహాలను సూచలను అందిస్తారు.

– సందీప్, పశువైద్యాధికారి, అనంతగిరి

గల్లంతైన యువకుడి కోసం గాలింపు

జలపాతంలో ఈతగాళ్లకు లభించని ఆచూకీ

పెదబయలు: మండలంలోని గిన్నెలకోట పంచాయతీ పిట్టలబొర్ర జలపాతంలో సెల్ఫీ తీసుకుంటూ కాలుజారి పడిపోయిన యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ఈ నెల 25న సాయంత్రం 4 గంటల సమయంలో అరకులోయ మండలం మాడగడ పంచాయతీ దొరగుడ గ్రామానికి చెందిన సమరెడ్డి వేణుగోపాల్ (24) గల్లంతైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తహసీల్దారు వి.రామ్మోహనరావు పర్యవేక్షణలో జామిగుడ వీఆర్వో రవికుమార్ ఆధ్వర్యంలో జలపాతంలో స్థానిక ఈతగాళ్లతో రోజంతా గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. జలపాతం 30 అడుగులు పైబడి లోతుగా ఉంది. కర్రలు, తాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఎగువ ప్రాంతాల్లో వర్షం కురుస్తుండడం వల్ల నీటి ఉధృతి ఎక్కువగా ఉందని, గాలింపునకు ఆటంకంగా ఉందని స్థానికులు తెలిపారు. గత ఈతగాళ్లను తెప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. ఈ ప్రమాదంపై ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లామని తహసీల్దారు తెలిపారు. జామిగుడ సర్పంచ్ తెరవాడ అన్నమ్మ, వీఆర్‌ఏ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


పిట్టలబొర్ర జలపాతంలో గల్లంతైన యువకుడి కోసం గాలిస్తున్న ఈతగాళ్లు

నూకాలమ్మా.. కరుణించమ్మా..


అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో భక్తులు


అమ్మవారి ముఖద్వారం వద్ద భక్తులు

భారీగా తరలివచ్చిన భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తుల పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధికసంఖ్యలో పిల్లాపాపలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ ఇళ్ల వద్ద శనివారం రాత్రంతా అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటలు చేసుకుని, అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లన్నీ నిండిపోవడంతో ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. వృద్ధులు, గర్భిణులకు అమ్మవారి దర్శనానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 14 మంది ఎంపిక


రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో బద్రీనాథ్

అనకాపల్లి: రాష్ట్రస్థాయి 11వ పవర్‌లిఫ్టింగ్ పోటీలు ఈనెల 29, 30, 31 తేదీల్లో మంగళగిరిలో జరుగుతాయని, ఈ పోటీలకు జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులను ఎంపికయ్యారని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. స్థానిక గాంధీనగరం ఎస్ఎస్ఎస్ జిమ్‌లో పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో జిల్లా నుంచి క్రీడాకారులను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పోటీల్లో జిల్లాలోని 12 జిమ్‌ల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. 53 కేజీల విభాగంలో సబ్ జూనియర్ పోటీలకు జి.భానుప్రసాద్, 66 కేజీల జూనియర్ విభాగంలో భానుతేజ, కె.జగన్నాథరావు, 83 కేజీల జూనియర్ విభాగంలో ఎస్.బాల సాయి చరణ్, 93 కేజీల జూనియర్ విభాగంలో పి.దినేష్, 76 కేజీల జూనియర్ మహిళా విభాగంలో కె.ప్రవల్లిక, 59, 66, 93, కేజీల సీనియర్ విభాగాల్లో ఆర్.నరసింహరాజు, కె.వి.వి.ఎస్.పి. ప్రసాద్, ఈ.గణేష్, 57 కేజీల సీనియర్ మహిళా విభాగంలో రాజనాల పూర్ణ, 59 కిలోల మాస్టర్-2లో ఎం.శ్రీనివాసు బెంచ్‌ప్రెస్ పోటీలకు, 93 కిలోల జూనియర్ విభాగంలో సాయి భాను దీపక్, 57 కిలోల మహిళా విభాగంలో జె.రామలక్ష్మి, 83 కిలోల మాస్టర్ -1లో ఎ.గణేష్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఎల్.వి.నాగరాజు నీలా, కోశాధికారి వేగి అజయ్, ఉపాధ్యక్షులు బి.శ్రీనివాస్, అందే గణేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు వసాది నానాజి, బొద్దపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాధార పంటలకు వాతావరణం అనుకూలం

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి : తేమను ఉపయోగించి 120 రోజుల వయస్సు గల చెరకు మొక్క, కార్సి చేసిన తోటలో మొక్కల మొదళ్లకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో విత్తుకోవడానికి అనువైన రకాలైన ఆర్‌జిఎల్ 2537, బీపీటీ 5204, 3291,ఎంటీయూ 1262, 1318, 1224, 1064 వంటి రకాలను ఎంపిక చేసుకుని విత్తనాన్ని సేకరించుకుని, ఖరీఫ్‌లో విత్తుకోవడానికి సిద్ధంగా రైతులు ఉండాలని ఆయన కోరారు. రాగల ఐదు రోజులలో వర్ష సూచన ఉన్నందున తేమను సద్వినియోగం చేసుకోవాలని, వర్షాధార చెరకు పంటలకు నేలను తయారు చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్‌లో కొర్రను వేసుకునే రైతులు, అధిక దిగుబడి వచ్చే తక్కువ కాల పరిమితిగల రకరాలైన గరుడ, సూర్యనంది, రేనాడు వంటి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. వర్షాలను ఉపయోగించుకుని నేలను 2–3 సార్లు మెత్తగా దుక్కిచేసి చదును చేసుకుని విత్తటానికి నేలను సిద్ధం చేసుకోవాలని ఆయన చెప్పారు. నువ్వు పైరును ఈ నెలాఖరులోగా వేసుకోవాలి, రైతులు వర్షాలను ఉపయోగంచుకుని వెంటనే నేలను దున్ని తయారు చేసుకుని నువ్వులలో అధిక దిగుబడినిచ్చే వైఎల్ఎం 17 లేదా వైఎల్ఎం 66 రకాలను విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలన్నారు. ఆఖరి దుక్కిలో యూరియ 22 కిలోలు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 63 కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పోటాస్ 17 కిలోలు చొప్పున వేసుకోవాలని ఆయన తెలిపారు. జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర వంటి పచ్చిరొట్ట పైరులను వరికి ముందు వేసుకుని, 40–45 రోజుల తరువాత నేలలో కలియదున్నకుంటే, వరి దిగుబడులు పెరగడమే కాకుండా నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు.

ఘనంగా ఆర్జిత సేవలు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. అర్చకుడు అప్పాజీ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భద్రంగా బడి బస్సు..

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయం. కాస్త దూరంగా ఉన్నా.. మంచి విద్యాసంస్థలో చదివించాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. ఇంటికి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లేందుకు బడి బస్సులకు వేలకు వేలు చెల్లిస్తారు. అవి విద్యార్థులను భద్రంగా తీసుకెళ్లి.. క్షేమంగా ఇంటికి చేర్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటి సామర్థ్యంపై దృష్టి సారించారు. తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారు.


బడిబస్సు ప్రమాణాలను పరిశీలిస్తున్న జిల్లా రవాణా అధికారి ప్రకాష్

- విద్యాసంత్సరం ప్రారంభం కానుండడంతో ప్రత్యేక దృష్టి
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం క్యూకడుతున్న వాహనాలు
- సామర్థ్య పరీక్షలకు ప్రత్యేక స్లాట్‌లు
- జిల్లాలో విద్యా సంస్థల బస్సులు 419
- ఇప్పటి వరకు ఎఫ్‌సీ రెన్యువల్ చేసుకున్నవి 185


ఫిట్‌నెస్ కోసం అనకాపల్లి ఆర్టీవో కార్యాలయం వద్ద క్యూకట్టిన బడిబస్సులు

తుమ్మపాల: నూతన విద్యాసంవత్సరం (2024–25)లో పాఠశాలలు పునఃప్రారంభానికి సమయం సమీపిస్తుండడంతో బడి బస్సుల భద్రతపై అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. వచ్చేనెల నెల 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. జిల్లాలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికశాతం విద్యార్థులు ఆయా యాజమాన్యాలకు చెందిన బస్సులపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతి బస్సు సామర్థ్యం సరిగ్గా ఉండాలి, బస్సు సామర్థ్యం సరిగ్గా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకే మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండిషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీ చేస్తుంటారు. గత ఏడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కాలపరిమితి ఈ నెల 15వ తేదీతో ముగియడంతో కొత్త సర్టిఫికెట్ల జారీ కోసం బడిబస్సులు ఆర్టీవో కార్యాలయం వద్ద క్యూకడుతున్నాయి. దీంతో బడిబస్సు ల సామర్థ్యం ఎలో అధికారులు పరిశీలిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఈ–స్లాట్ తేదీల ఖరారు

అనకాపల్లి, నర్సీపట్నం రవాణా శాఖ కార్యాలయాల అధికారులు జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాహనాలు ఎలా ఉండాలనే విషయమై ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలకు రవాణా శాఖ అధికారులు తెలియజేశారు. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్‌లోనే విద్యాసంస్థ యాజమాన్యాలు ఈ–ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం ఎఫ్‌సీ చేయించుకునేందుకు రవాణాశాఖ కార్యాలయం అధికారులు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహిస్తారు.

మండలాల వారీగా బస్సుల వివరాలు

జిల్లాలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు 419 వరకు ఉన్నాయి. మండలాల వారీ గా పరిశీలిస్తే అనకాపల్లి మండలంలో 69, అచ్యుతాపురం 37, బుచ్చెయ్యపేట నాలుగు, చోడవరం 33, దేవరాపల్లి నాలుగు, గొలుగొండ రెండు, కె.కోటపాడు రెండు, కశింకోట 22, కోటవురట్ల ఒకటి, మాకవరపాలెం 28, మునగపాక 10, నక్కపల్లి రెండు, నర్సీపట్నం 47, నాతవరం మూడు, పరవాడ 44, పాయకరావుపేట 34, రాంబిల్లి 11, రావిక మతం 12, రోలుగుంట రెండు, ఎస్.రాయవరం 19, సబ్బవరం 25, వి.మాడుగుల మూడు, యలమంచిలి మండలంలో ఐదు బస్సులు ఉన్నాయి. ఈ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్డుపై తిరగడానికి వీల్లేదు. 2017 నుంచి బడిబస్సులకు స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటుచేసుకోవడం తప్పనిసరి చేశారు. ఈ బస్సుల గంటకు 60 కిలో మీటర్లలోపు వేగంతో మాత్రమే ప్రయాణించాలి.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేస్తాం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) తప్పనిసరిగా ఉండాలి. వచ్చేనెల 15వ తేదీ లోపు ఎఫ్‌సీ చేయించుకోవాలి. పాఠశాలలు ప్రారంభానికి ముందే అన్ని అనుమతులు పొందాలి. జిల్లాలో అనకాపల్లి డివిజన్‌లో 65, నర్సీపట్నం డివిజన్‌లో 120 బస్సులు కలిపి మొత్తం 185 బస్సులను గడిచిన ఐదు రోజుల్లో తనిఖీలు చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేశాం. జిల్లాలో విద్యా సంస్థల బస్సులను ఆకస్మికంగా తనిఖీ చేసి, ఎఫ్‌సీ, పర్మిట్, కండిషన్ లేని వాటిని సీజ్ చేస్తాం.

– కె.వి.ప్రకాష్, జిల్లా రవాణా శాఖ అధికారి, అనకాపల్లి

ఇవి తప్పనిసరి

- పాఠశాల బస్సును నడిపే డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి.
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూసుకోవాలి.
- బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. హ్యాండ్ బ్రేక్, స్పీడో మీటర్ సక్రమంగా పనిచేయాలి.
- స్టీరింగ్, టైర్లు కండిషన్ సరిచూసుకోవాలి.
- ప్రతి బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స బాక్స్ అందుబాటులో ఉంచాలి. వారానికోసారి ప్రిన్సిపాల్, సంబంధిత అధికారి ఈ బాక్స్ తనిఖీ చేయాలి. నెలకోసారి పేరెంట్స్ కమిటీ పరిశీలించడంతో పాటు, దీనికోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.
- బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరలు ఏర్పాటు చేయాలి. సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, విద్యాశాఖల సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒకరోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.
- బస్సు నడిపే డ్రైవర్లు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.
- బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా ఉండేలా లోహంతో చేయించాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఏర్పాటు చేసుకోవాలి.
- అత్యవసర ద్వారం అని తెలిసేలా స్పష్టంగా కనిపించే విధంగా రాయించాలి.
- బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందు తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలి.విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు అటెండెంట్ పర్యవేక్షించాలి.
- పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి. బస్సులో అటెండర్ ఉండాలి.
- సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి.
- బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాల రూట్ ప్లాన్ ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, అలాగే డ్రైవర్ వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెలా బస్సు కండిషన్ యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచాలి.
- బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.
- వెనుక నుంచి వచ్చే వాహనాలను చూసేందుకు వీలుగా బస్సు డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు బయట, లోపల మిర్రర్లు ఏర్పాటు చేయాలి. బస్సు ఎట్టి పరిస్థితుల్లో రాంగ్ రూట్లో ప్రయాణించరాదు.